


# 10

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

బడి వదలి ఇంటికొచ్చేసరికి పంచలో కసవూడుస్తూ ఏదో గొణుక్కొంటోంది ఇందిర.

దొడ్లోకి నడిచి కాళ్లుమొహం కడుక్కొని టవల్‌తో తడి తుడుచుకొంటూ వచ్చి మంచం మీద కూచున్నాను.

"యీ పిట్టలపోరు పల్లేకుండా వుండా. వీటె సరుకుదశల - సందూ విరామం లేకండా కసువు రాల్చడమే..." అంటూ వూడ్చిన కసవును చేటకెత్తి పేడగంపలో పోసింది.

"రోజూ వుండే తంతే గాదూ ! గొణిగితే తీరతాదా ?" అన్నాను.

"నీకేం ? వొంగి వూడ్చేవాల్లకు తెలస్చాది" అంటూ వంటిట్లోకెల్లింది. తలెత్తి దూలం మీదుగా చూశాను.

దంతెల సందుల్లోంచి రెండుచోట్ల కిచకిచలు విన్పించాయి.

ముక్కున గడ్డిపోచ కరుచుకొని నాకేసి తొంగి తొంగి చూస్తోంది ఓ పిచ్చుక. దంతెల సందు దూలం మీద గూటిలో కుదర్చబోయింది గాని పోచకాస్తా జారి నేలమీద రాలింది. దాని వెనకే పిట్ట కూడా నేలపైకి వచ్చి మరోసారి నాకేసి అనుమానంగా చూసి ముక్కున కరచుకొని గాల్లోకి ఎగిరింది. మెల్లిగా లేచి మూలనున్న

# పిట్టపాట



దోమతెర కర్ర అందుకున్నాను.

దూలంమీది గడ్డిపోచల కుదురును జాగ్రత్తగా కిందకు రాల్చసాగాను.

ఓ వైపు అనుమానంగానే వుంది - కుదురులో పిట్ట గుడ్లు వుంటాయేమోనని. మరోవైపు అనుభవం నొక్కి చెబుతోంది - గూడు పూర్తిగాకుండా పిట్టలు గుడ్లు పెట్టవని. గడ్డిపోచలు, పొరక పుల్లలు, చిన్న చిన్న పుడకలతో కుదురు ఏర్పాటు చేసికోవాలి. దాని మధ్యన నారపీచు, దూది, దారం, మెత్తని యీకలు వగైరాలను పేర్చి పొత్తిళ్లు తయారు చేసికోవాలి. అప్పుడు గదా గుడ్లు పెట్టేది. పొదిగేది. పిల్లల్ని లేపేది.

గూడు పెరుకుతూ వుంటే కిటికీ వూచల మీద కూచుని దిగాలుగా చూస్తున్నాయి పిచ్చుకలు.

రెండవ గూటికేసి కదులుతూ వుంటే కాఫీ గ్లాసుతో వచ్చింది ఇందిర. "వొద్దొద్దు... గూడు పీగ్గాకు.." అంది,

గ్లాసందుకొంటూ ఆమెకేసి వింతగా చూశాను.

"గుడ్లు పెట్టుకొనుంటాయేమో ! కిందరాలితే పగిలిపోతాయి. పాపం కొట్టుకొంటది" చెప్పింది.

ఆమె మాటలు పట్టించుకోలేదు.

కాఫీ తాగింతర్వాత దంతెలసందు చెత్త నంతా తీసిపారేశాను.

రెండవ గూటిలో కూడా గుడ్లు లేనందుకు ఏదో గండం గడచినట్లుగా "అమ్మయ్య" అంటూ గుండెలమీద చేతులు వేసికొంది ఇందిర.

కసవులో అక్కడక్కడా దూదిపింజల్లాంటి పిచ్చుక యీకలు కన్పించాయి. గుడ్లకోసం మెత్తటి పొత్తిళ్లను తయారు చేసి కొంటోందన్న మాట. అంటే - ఇవాలో రేపో గుడ్లు పెట్టొచ్చు.

నెల రోజుల్నించి మొదలైంది ఈ గొడవ. సంక్రాంతి పండక్కి అటు ఇటుగా అదనుకొస్తాయి. ఇల్లంతా కసవు రాల్చి రోత చేస్తాయి. పిట్టల్ని ఇంట్లోకి రానీకుండా చేయాలని ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. గూడు రాల్చితేనన్నా ఇల్లిదుస్తాయని ఉపాయమెత్తితే అవి పూర్తిగా మొండికేశాయి. ఎన్నిసార్లు గూడు రాల్చితే అన్నిసార్లూ పునర్నిర్మించుకొనేందుకే ప్రయత్నిస్తున్నాయి.

మొన్న మొన్నటిదాకా అద్దం ముందు గోలజేస్తుండేవి. ఫ్రేం మీద వాలి అద్దంలోకి తొంగిచూస్తూ తమ ప్రతిబింబాల్ని ప్రత్యర్థిగా భావించి అలిసి పోయేదాకా ముక్కుతో పొడుస్తూ కొట్లాడేవి. అలుపు తీర్చుకొని మళ్ళీ గొడవ కొనసాగించేవి. అక్కడే రెట్టవేయటం. కాళ్ళతో తొక్కటం, అద్దం నిండా పాదముద్రల్ని అంటించడం.. అద్దం మురికి మురికిగా, రోతరోతగా మారటం...

తమ ప్రతిబింబాలతో పిచ్చుకలు చేసే యుద్ధాన్ని సెల్ కెమెరాతో చిత్రీకరించి మిత్రులకు చూపిస్తే ఎంత సంతోషించేవారనీ ! సమస్య నాదికాకుంటే నేను కూడా ఆహ్లాదంగా స్పందించేవాణ్ణే కదా !

ముప్పయేళ్ల క్రితం మా నాన్న నిలేసిన దంతెల మిద్దెయిది. అప్పుడు వూరంతటికీ కలిపి ఐదారు పాతమిద్దెలు తప్ప మిగిలినవన్నీ బోదకొట్టాలే. రెండు తరాల కిందటి మట్టిమిద్దె వూడబెరికి కొత్తమిద్దె కట్టించటం ఆ నాటికి మా నాన్న సాహసం చేసినట్లే. ఇరవైవేల లోపు ఖర్చుతో నిర్మించిన యీ మిద్దెకు ఇప్పుడు మరమ్మత్తులు చేయించాలన్నా లక్ష రూపా యలకు తగ్గేట్లు లేదు.

ప్రభుత్వ గృహాల పుణ్యమా అని వూరంతా స్లాబు మిద్దెలయ్యాయి. మాలాంటి నాలుగైదు పాత దంతెల మిద్దెలుతప్ప ఒక్క బోదకొట్టం కూడా పిచ్చుకలకు మిగల్లేదు. కొట్టాలున్నప్పుడు వాటికి నివాస సమస్య ఉండేది కాదు. మిద్దె దంతెల సందుల్లోకి కాపురం వచ్చే ఖర్మ లేదు. వచ్చినా ఒక్కసారి గూడు పెరికితే తిరిగి ఆ తావుకేసి చూసేవి కావు.

సాయంత్రంగా పొద్దు తిరుగుడు చేలకేసి వెళ్లాను.

కనుచూపు మేర సాగు చేసిన పొద్దు తిరుగుడు పంట బంగారు రంగు పూతలతో కన్నుల పండువుగా వుంది. సాయంత్రపు ఎండలో మిలమిల మెరిసి పోతూ నేలంతా బంగారు దుప్పటి పరచినట్లుంది.

ఆకాశంలో అక్కడక్కడా మేఘాలు ఆడు తున్నాయి.

మా పొలంలో పైరు చూడగానే నాకు కడుపు నిండినట్లయింది. కోరు రైతు తిరిపేలు చేలో మడవ కడుతున్నాడు.

నన్ను చూడగానే లేచి నిలబడ్డాడు.

"మొన్న నాలుగు సినుకులు రాలి, నిన్నా యియ్యాల మోడాలాడి పైరును దెబ్బగొట్టెగద మామా!" అన్నారు.

నాకర్థం కాలేదు.

"ఇట్నే మోడాలాడ్తాంటే పంట సేతికొచ్చేది నమ్మకంలే..."

నొసలు ముడేసి అతనికేసి చూశాను.

పైరులో కళ తగ్గలేదు. కంకి రంగులో కాంతి మాసిపోలేదు. పొద్దు తిరుగుడు పంటకు సహజంగా వచ్చే వైరస్ తెగులు ఛాయలు కన్పించ లేదు. కాండం నించి పువ్వుదాకా నల్లగా పేడలాగా మారలేదు.

మరి... ప్రమాదం ఎక్కన్నించి ?

చూపుడువేలుచాపి రెండు కణుపుల కొలత చూపిస్తూ "ఇంత పొడవునా కంకికి ఒకటో రెండో పురుగులుండాయి. ఇట్టనే మోడాలాడ్తాంటే నాలుగైదు అయితాయి. గింజలన్నీ తిని కంకిని గగ్గిజేస్చాయి... సూజ్జూరా... పురుగు పారాడినంత దూరం గింజ వుందేమో !" అంటూ ఓ పువ్వును నా కేసి తిప్పి చూపించాడు.

జాగ్రత్తగా గమనిస్తే... నిజమే ! పురుగు నడిచిన దారి కన్పిస్తోంది. సుంకు కింద పాలగింజల మధ్యగా దాగి వున్న పురుగును కూడా పీకి చూపించాడు తిరిపేలు.

ఒళ్ళు జలదరించింది నాకు.

"ఎకరో అర్దెకరో అయ్యింటే గోరింకలో, పిట్టలో ఏరి తినేటివి. ఇన్నిన్ని ఎకరాలు యానుం చొస్చాయి పిట్టలు?... అస్సలు పిట్టలేదుండాయి ? – తిండి గింజల పంటలు పండిస్చాంటే గాదూ... "మడవ వేసేందుకు వంగాడు అతను.

జరగబోతున్న నష్టంపూర్తిగా అర్థమైంది నాకు. మనస్సంతా విచారం అలుముకొంది.

పైరు వాటం చూసి ఎకరాకు పది క్వింటాళ్ళ గింజలవుతాయని ఆశపడ్డాము. కోరు రైతుకు సగం పోయినా నాకు సగం మిగులుతాయి గదా ! ఐదెక రాలకూ ఇరవై ఐదు క్వింటాళ్ళవుతాయి గదా ! ఏ పదేళ్ళకో ఒకసారి వచ్చే లాటరీ లాంటి ఫలితాన్ని ఇప్పుడు కళ్ళ జూడబోతున్నాయని ఆనందపడ్డాము.

"అదా.... ఆ పాదమీంద దొండ తీగెకు ఎర్రగా మాగిన దొండపండ్లుండాయి సూడు... అంద కుంటే నేనొచ్చి కోసిస్చా....."

అతనికేసి అదో రకంగా చూస్తూ గట్టు వెంట ముందుకు సాగాను.

రెండు చేలకవతల చెరువులోంచి ఏవో గలగలలు. బురద గుంటల్లో చేపలకోసం దిగారు కాబోలు. దొరికిన చేపంతా కడుపునిండా గుడ్డుతో రుచికరంగా వుంటుంది.

అయినా పైరంతా పురుగుల పాలవుతోంటే వీళ్ళకెవరికీ బాధలేదా ? దొండపండ్ల మాధుర్యమూ, చేపల కూర కమ్మదనమూ వీళ్ళకెట్లా రుచిస్తోంది?

వెనుదిరిగి ఇంటిదారి పట్టేసరికి చీకటి పడింది.

ఎర్రగా మాగిన టమాటాలను గంపనిండా కోసుకుని ఇంటికి వెళుతూ ఉంది ఓ ఆడమనిషి. కళ్ళంలో ఎండబోసిన పండు మిరపల్ని కుప్పజేసి పట్టలు కప్పుతున్నాడు ఓ రైతు.

**"ఎప్పుడో వచ్చే సుట్టాలు మామా ఈ పిట్టలు. మేలుచేసే సుట్టాలు – మనల్ను సూసిపోదామని ఎక్కన్నో కొండల్లోంచి సుట్టపు సూపుగా వస్చాయి. మనం బాధల్లో వుంటే తీర్చిపోతాయి."**

వర్షాలు బాగా కురిశాయి. పైరు బాగుంది. తెగులు ఇంత మోసం చేస్తుందనుకోలేదు. ఇంత పెట్టుబడి పెట్టి. ఇంతింతగా సేవలు చేయటం వ్యర్థమనిపించింది. నేనయితే మడవ కూడా కట్టేవాన్ని కాదు. పంటకాలమంతా చేసిన కష్టం తెగులు రూపంలో ఆవిరవుతోందని స్పష్టంగా తెలుస్తోన్నా తిరిపేలు మాత్రం తనపని మానలేదు.

"యీ కారన్నా పదిరూపాయలు కండ్ల జూడ్డామనుకొంటి" నిట్టూర్చాను.

"మనమనుకొంటే సరిపోతదా సోమీ ! ప్రాప్తముండొద్దూ ?" చెప్పాడు తిరిపేలు.

వాస్తవానికి నా పెట్టుబడి కంటే అతని శ్రమ శక్తే అధికం. అయినా అతను నాలా బాధపడటం లేదు... ఎందుకని ?

బహుశా... అతను నాలా ఎక్కువ ఫలితాన్ని వూహించి ఆశలు పెంచుకోలేదు కాబోలు. గరిష్ట ఫలితాన్ని లెక్కగట్టి దాన్నంతా నష్టంగా పరిగణించ కుండా కేవలం పెట్టుబడిని మాత్రమే నష్టంగా భావిస్తున్నదేమో !

మా కళ్ళంలో చింత చెట్టును చూడగానే అమ్మ గుర్తొచ్చింది. పండుకాయల్ని రాలిపి అక్కగారికి ఇద్దరికీ చెరిన్ని పంపమని పోదు జేస్తోంది.

కాయలు సంచికేసికొని తీసికెళ్లి ఇచ్చి వచ్చేం దుకు ఎవరున్నారని ? వాళ్ళొచ్చి తీసికెళ్లొచ్చు గదా!

ఇంట్లోకి అడుగు పెడుతూనే అమ్మ అంది వాణికే కంఠంతో "అక్క కాడికి పోయి రాగూడదూ?" అని.

"పోతాలే..." చెప్పాను.

"ఎప్పుడు ? నీకు సుట్టపక్కాలు కాబట్టం దారా ! మా పానముండేదాకన్నా సుట్టాలను ఇంటి కాడికి రానీ..."

"నేనొద్దంటుండానా ?"

"నువ్వొద్దనవు. వాళ్లేం నీ యింటికి తిండి కొస్చారా ! వాళ్లు నాలుగుసార్లు వొస్చి నువ్వు ఒక్కసారన్నా పోతే గాదూ !"

సమాధానం చెప్పకుండా లోపలికి నడి చాను.

కొంతసేపయింతర్వాత బైటకొచ్చి మంచం మీద కూచున్నాను.

"మొన్నెప్పుడో పెద్దాయమ్మి కొడుకు ఎదురైతే పలకరించలేదంటనే?" అరుగుమీంచి అడిగింది అమ్మ.

తలెత్తి చూశాను.

"పెద్దక్క కొడుకా ?" అంటూ స్మృతుల్ని తవ్వకోబోయే లోపలే గుర్తొచ్చింది. "నేను మా సార్‌తో మాట్లాడతా వున్నె.... వాడు పిల్చిండుగానీ మాటల సందట్లో కుదరలే... మల్ల పలకరించుదామనుకొంటే అప్పుడే వెళ్లి పోయిండు" చెప్పాను.

"అంత బలుపు పనికిరాదబ్బీ !" అమ్మ అంది. "సావుకారినని మిడిసిపడగాకు. సుట్టపక్కాలను ఇప్పుడు పోగొట్టుకొంటే కావాల్సినప్పుడు దొరుకు తారా?" చెబుతూ అరుగు దిగి ఇంట్లోకి నడిచింది.

నాకు నవ్వొచ్చింది – ఆమె కోపమూ, విసురూ చూసి.

వాళ్ల దృష్టిలో నెలకు పదివేల రూపాయలు జీతం తీసికొనే తను షాహుకారే. కాదనేందుకు లేదు.

కానీ – తనకెప్పుడూ ఆ భావన లేదు.

ఏదేమైనా అమ్మ అన్నట్లు నాన్న గతించిన తర్వాత చుట్టాల రాకడ బాగా తగ్గింది. బహుశా తను వాళ్ళ ఇళ్లకు అస్సలు పోకపోవటం కూడా ఒక కారణం కావొచ్చు.

వెళ్ళేందుకు సమయం లేక కాదుగానీ – సంక్రాంతికనీ, దసరాకనీ, వేసవి కాలమనీ కావలసి నన్ని సెలవులున్నాయి. ఎందుకో వెళ్ళబుద్ధి కావటం లేదు. ఏ పనీలేకుండా పూరకే వెళ్లిరావటం నాకిష్టంగా లేదు. అయినా ఏడాదికి ఒకటి రెండుసార్లు అక్కాగారు వస్తుంటారు. అమ్మను చూసిపోయే నెపంతో – కాయలూ పండ్లూ తీసికొని.

మళ్లీ రోజు చాలామందితో చర్చించాను పురుగుల దాడి గురించి. కనిపించిన వాడికల్లా, పంచిపెట్టాను మనస్సులో పెరిగే ఆవేదన గురించి, ఒక్కో పురుగును పట్టి ఏరివేయటం తప్ప మార్గాంతరం లేదుట. అది సాధ్యమయ్యే పనికాదు.

అత్యవసరంగా సర్వశిక్షా అభియాన్‌వారి రెండు రోజుల శిక్షణా కార్యక్రమాలకు కడప వెళ్ళవలసి వచ్చింది. మండల విద్యాశాఖాధికారి నేరుగా స్కూల్ వద్దకే వచ్చి ప్రాధేయపడటంతో తప్పలేదు. రిసోర్స్ పర్సన్‌గా వెళ్ళి అక్కడశిక్షణ పొందటం. రేపు మండల పరిధిలో ఉపాధ్యాయులందరికీ అందివ్వటం.

రెండోరోజు రాత్రి పదిగంటలకు ఇంటి కొచ్చాను.

స్నానం చేసి బైటకొచ్చి నిల్చుంటే చావిడి వద్ద మర్రిచెట్టునిండా మిణుగురు పురుగుల విన్యాసం చూపుల్ని లాక్కుంది. ఆకు ఆకూ మిణుగురు పురుగుల పుణ్యమా అని వెలిగిపోతుంది.

పొద్దు తిరుగుడు కంకుల మీది పురుగులు గుర్తొచ్చి ఇంట్లోకెళ్లి ఇందిరను ప్రశ్నించాను.

రెండుకు నాలుగయ్యాయిట పురుగులు. ఇప్పటికే సగం పంట దిగుబడి పోయినట్లేనట. మరో రెండ్రోజులు పురుగు వదలకుంటే పాతిక పంట కూడా చేతికి రాదుట. బాధగా చెప్పింది ఆమె.

ఒక యేడాది వానలు రాక బోరుబావుల్లో నీళ్లందవు. ఇంకో యేడాది వానలు ఎక్కువై మెట్టపైర్లు నాశనమవుతాయి. అన్నీ బావున్నయేడు యిదో.... యిట్లా ఏదొక అకాల మృత్యువు...

వ్యవసాయం జూదమైంది.

ఈ పొలం లేకుండా తను ఉపాధ్యాయుని గానే బతికి వుంటే అందరూ అనుకొంటున్నట్లు తన వద్ద డబ్బు దండిగానే వుండేది. ఎందుకంటే – తను పొదుపరిగా జీవిస్తాడు కాబట్టి. బోరుబావి తవ్వించటానికీ, కరెంటు కనెక్షన్‌కూ, భూమి చదును చేసేందుకూ, కంపచెట్లు వెయ్యించేందుకూ దాదాపు రెండు లక్షల దాకా ఖర్చయింది. చీటీలు పాడో, లోను తీసికొనో పెట్టుబడి పెట్టాను. యేటా పైరుకోసం మళ్లీ పెట్టుబడులు.... దిగుబడి చూద్దామా అంటే వడ్డీలు కూడా రావటం లేదు. కోరు చేసే వాళ్ళకు చేతి కష్టానికి కూలి దొరుకుతుందేమో గాని నాకు పైరు పెట్టుబడులు రావటం గగనంగా వుంది. మా అమ్మా నాన్నల హయాంలో కుటుంబాన్నంతటినీ పొలమే సాకేది. ఇప్పుడు పొలాన్ని కాస్తా నెలజీతంతో నేనే సాకుతున్నాను.

తెల్లారు జాము ఐదుగంటలకే మెలకువ వచ్చింది. ఇంట్లోకి జొరబడిన చలి దుప్పట్లోకి దూరేందుకు వెనుదీయలేదు. బైటకెళ్లే సరికి వీధిలో చలిమంట... చుట్టూ దుప్పట్ల ముసుగుతో జనం.

మంట వేడికోసం పానం పీకింది. వాళ్లతో కలిసి చలికాపుకొనే దాకా శరీరం మాట వినలేదు.

ఆదివారం కాబట్టి ఇంటిదగ్గరే వున్నాను.

నేను లేని యీ రెండ్రోజుల్లో దూలం మీది దంతెల సందుల్లో నాలుగుచోట్ల పిట్టగూళ్లు పూర్తయి వున్నాయి. నారపీచులు, గరికపోచలు దూలం మీంచి కిందకు వేలాడుతూ అసహ్యంగా కనిపిస్తున్నాయి. కొత్తవాళ్లెవరైనా వస్తే ఆ దృశ్యాన్ని చూసి 'మొరటు కొంప' అనుకోరు గదా అనిపించింది. పిచ్చుకల మీద కోపమొచ్చింది. దోమతెర కర్ర అందుకొన్నాను.

అప్పటికే దంతెల సందుల్లోని పిచ్చుకలు ప్రమాదాన్ని కనిపెట్టాయి కాబోలు ఏదో ఉపద్రవం ముంచుకొచ్చినట్లుగా అటు ఇటు గాభరాగా తిరగ సాగాయి.

బహుశా గుడ్లు పెట్టుకొన్నాయేమో !

మనస్సులో సంకోచం

కళ్ళకెదురుగా దూలం మీంచి అసహ్యంగా వేలాడుతూ కన్పించే చెత్తా చెదారపు దృశ్యం మరోవైపు విచక్షణను చంపేస్తోంది.

మనస్సు గట్టి జేసుకొని ఓ గూటికేసి కర్ర ఎత్తాను.

"అబ్బీ ! ఒరే నాయినా ! ఆసన్నపానాలు నీకేం అపకారం జేసె? యాన్నో పైన పైన తిరిగేటివి.. నీ కాల్లకడ్డమొచ్చెనా ? సేతలకడ్డమొచ్చెనా ?... గూడు రాలగొట్టగాకు నాయినా!... గుడ్లు పెట్టుకోనుం టాయిరా !" ప్రాధేయపడింది అమ్మ.

ఆమె వేడికోలు, పిచ్చుకల ఏడుపుల మధ్య, తన్నుకొచ్చే అసహనాన్ని అదిమిపట్టలేక... గూటిని మెల్లిగా సగం లాగేసరికి.. సన్నని రబ్బరు బంతిలా జారి నేలమీద బడి... 'టప్'మని పగిలింది బూడిద రంగులోని ఓ పిట్టగుడ్డు.

అబ్బీళ్లు కొరకటంలో భావోద్వేగాల్ని అణచు కొంటూ దానికేసి చూశాను. గుండెల్లోంచి ఎగదన్ను కొచ్చే జలదరింపుల్ని అదిమిపడుతూ పైకెగజూసి గూటిని నెమ్మదిగా లోనికి జరిపాను.

"పిట్టలు రాకుండా, సుట్టాలు అడుగు బెట్టకుండా ఇండ్లంతా ఒక్కనివే దొల్లుదామను కొన్నావా? వాటి ఉసురు పోసుకుంటాండవే ! ఇంగో పాపం మూటెగట్టుకొందామనేనా....?" అమ్మ కోపంగా గొణుగుతోంది.

ఈలోపు ఇందిర వచ్చి చూసి "పాపం గాదూ!" అంటూ నా చేతిలోని కర్రను లాక్కుంది.

నాక్కూడా మనసులో ఏదో అపరాధ భావన రగులుతూ వుంది గాని, దాన్ని తొక్కిపట్టేందుకు ఏవేవో కారణాల్ని వెదుక్కొంటున్నాను.

పదిగంటల ప్రాంతంలో చేలకేసి వెళ్ళాను.

పురుగు పొరాడిన జాడలతో తొర్రిపళ్ళ నోటిలా తయారైన పొద్దు తిరుగుడు పూలు అవే గాయాలతో కంకులుగా మారేందుకు ప్రయత్నిస్తు న్నాయి.

మా చేని ఇవతల గట్టున్నే ఎదురయ్యాడు కోరు రైలు తిరిపేలు.

"చేలోకి పోవద్దులే మామా !" అన్నాడు.

ప్రశ్నార్థకంగా చూశాను.

"చేనంతా పిట్టలు వాలుండాయి.." అతని మొహం నిండా ఏదో ఆనందం.

కంకుల్లో మిగిలిన పాలగింజల్ని కూడా పొడిచి తినేస్తాయి గదా పిట్టలు ! వాటిని అదిలించి తరమకుండా ఇక్కడెందుకున్నట్లు ?

"కొండ పిట్టలు మామా ! మందలు మందలు వొచ్చి వాలినాయి. 'పెడిసె' అంటారు సూడు. అవి..."

నేనెప్పుడూ చూడలేదు వాటిని.

"మారాజులు...... దేవతలట్లా వొచ్చి పడినాయి. పురుగులన్నిట్నీ యేరక తింటండాయి... మనసేనంతా రొండుగంటలు పట్టదు... సూడు మామా ! దేవుడు కన్ను దెర్సాలగాని మనుసుల్తో ఏమయితది ? ఎన్ని మందులు చల్లితే మాత్రం ఒక్క పురుగును సంపుకుంటాం ! ఇంగొక్క గంట ఓపిక పట్టు... సేనంతా ఒక్క పురుగు మిగుల్తే సూడు!" ఆనంద పరవశుడవుతున్నాడు అతను.

నాకయితే ఒళ్లంతా ఒక్కసారిగా జలదరించి నట్లయింది.

"ఎప్పుడో వచ్చే సుట్టాలు మామా ఈ పిట్టలు. మేలుచేసే సుట్టాలు-మనల్నుసూసి పోదామని ఎక్కన్నో కొండల్లోంచి సుట్టపు సూపుగా వస్సాయి. మనం బాధల్లో వుంటే తీర్చిపోతాయి." గట్టుమీద కూచుని పరవశించిపోతూ చెబుతున్నాడు తిరిపేలు.

ఆహారాన్ని వెదుక్కొంటూ వచ్చిన యీ కొండపిట్టలు నిజంగా తమకు చుట్టాలే !

వెంటనే నా కళ్లముందు వూరపిచ్చుకలు కదలాడాయి, మరెక్కడా తావు దొరక్క దంతెల సందుల్లో గుడ్లు పెట్టేందుకు అవి పడే అగచాట్లు కళ్ళముందు మెదిలాయి. పరిశుభ్రత పేరిట, నాగరికత పేరిట వాటిని తరిమేందుకు తను అనుసరించిన పద్ధతుల్లోని కారుణ్య రాహిత్యం ఇప్పుడు ఎదురుగా నిలబడి సిగ్గు కలిగిస్తోంది.

మిద్దె పంచలోని దంతెల కాండ్లకు జొన్న, కొర్ర, సజ్జ కంకుల్ని వేలాడేసి పక్షుల్ని ఇళ్లల్లోకి ఆహ్వానించి మరీ ఆహారమందించే నాన్నతరం నుంచి పక్షులు ఇళ్లల్లో గూడు కట్టుకోవటంలో పొరబాటున రాలిపడే పుల్లా పుడకలు అశుభ్రతకు , అనాగరికతకు ఆనవాళ్లుగా భావించే యీ తరానికి ప్రతినిధిగా ఉన్నందుకు లజ్జగా వుంది.

కేవలం అవసరపడితేనే మనుషుల్ని కల వాలనుకోవటంలో ఏం కోల్పోతున్నామో అర్థమవుతూ వుంది. చుట్టాలు బంధువుల్ని కలవటమనేది హృదయ సంబంధమైన వ్యాపారంగా అమ్మానాన్నలు భావించ టంలో వాళ్లు పొందుతున్న దేదో తెలిసివస్తూ వుంది.

పిట్టల్ని గురించిన విషయం బడిలో అద నంగా చేర్చ వలసిన పాఠంగా అవగాహనకు వస్తూ వుంది.

ఇంటికి వెళ్లేదాకా కంటిముందు ఏదో కలలాంటి దృశ్యం. మిద్దె చుంచులకూ, చెట్టు కొమ్మలకూ పనికిరాని డబ్బాలు, కుండల్లాంటివి వేలాడదీసి వున్నట్లూ, అందులో గూళ్ళు నిర్మించుకొని పిట్టలు కిలకిలలాడుతున్నట్లు పిట్టలూ పిల్లలూ ఒకే యూనిఫాం తొడుక్కొని ఏవో పాటలు పాడుకొంటూ బడిలోకి అడుగులేస్తోన్నట్లూ... మా చుట్టాలూ, బంధువులూ, హితులూ, సన్నిహితులూ దూరంగా నిల్చుని ఆనందంగా చప్పట్లు చరుస్తున్నట్లూ....